మేట్ల పర్యవేక్షణలోనే 'ఉపాధి'


ఉపాధి పనుల్లో కూలీలు

- ఫీల్డ్ అసిసెంట్లు లేకుండా నాలుగేళ్లుగా పనులు
- జిల్లావ్యాప్తంగా 65 పంచాయతీల్లో ఇదే పరిస్థితి
- అదనపు బాధ్యతలు ఎత్తివేయాలంటున్న ఎఫ్‌ఏలు

రామగుండం: నూతన పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం అర్హతగల గ్రామాలను ప్రభుత్వం గ్రామ పంచాయతీలుగా గుర్తించింది. వీటికి 2019లో ఎన్నికలు కూడా నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 65 కొత్తగా ఏర్పడినవే. అయితే ఆ పంచాయతీల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు మాత్రం మేట్ల పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో కూలీల హాజరు, పని ప్రదేశాల ఎంపిక, వేతనాల చెల్లింపులు తదితర పనులన్నీ వీరే పూర్తి చేస్తున్నారు. ఒక్కోసారి పాత గ్రామ పరిధిలో పనిచేసిన ఫీల్డ్‌అసిస్టెంట్లు వెళ్లి ఉపాధి పనులు పరిశీలిస్తున్నారు. ఈ గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాల్సి ఉన్నా.. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం ఇప్పుడు పనులు పర్యవేక్షిస్తున్న వారిలో అర్హత గలవారినైనా ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని కోరుతున్నా పట్టించుకునేవారు లేరు.

అదనపు బాధ్యతలు ఎత్తివేయాలి



నేను పెద్దంపేట ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. రాయదండిలో మేట్ పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. రాయదండిలో పనులు కూడా పర్యవేక్షించాల్సి వస్తోంది. అదనపు బాధ్యతలు ఎత్తివేయాలి.

– రాజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, పెద్దంపేట

పదోన్నతి కల్పించాలి



కొత్తగా పంచాయతీగా ఆవిర్భవించినప్పటి నుంచి మేట్‌గా ఉపాధి పనులు చేయిస్తున్న. రాయదండి, పెద్దంపేట వేర్వేరు పంచాయతీలయ్యాయి. నాకు రాయదండి మేట్ నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి కనీస వేతనం అందజేయాలి.

– గుమ్ముల రితీష్, రాయదండి, మేట్

ఆదేశాలు రాలేదు



నూతన గ్రామ పంచాయతీల్లో మేట్లుగా కొనసాగుతున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలనే విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

– యాదగిరి, ఎంపీడీవో, అంతర్గాం

పల్లెపల్లెకూ రవాణా సౌకర్యం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర సర్కార్ పల్లెపల్లెకూ రవాణా సౌకర్యం కల్పిస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని అంకంపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మడిపెల్లి కాలనీ వరకు, దుబ్బపల్లి నుంచి అంకంపల్లి నర్సరీ వరకు రూ3.40కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే టెంకాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం, సర్పంచ్‌లు చిరంజీవి, స్వప్న, రాణి, ఎంపీటీసీ సంపత్, నాయకులు రాజకొమురయ్య, మోహన్, నాగరాజు, మల్లన్న, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, సంజీవ్ పాల్గొన్నారు.

కర్ణాటక స్ఫూర్తితో రాష్ట్రంలో ముందుకు..


మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

మంథని: కర్ణాటక ప్రజలిచ్చిన స్ఫూర్తితో రాష్ట్రంలో ముందుకెళ్తామని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కీలక భూమిక పోషించి, అక్కడి ప్రభుత్వ ఏర్పాటు అనంతరం సోమవారం రాత్రి మంథనికి వచ్చిన శ్రీధర్‌బాబుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన చౌరస్తాలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ప్రజలు సంక్షేమం కోరుకున్నారని, అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని నమ్మారన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్యపు, అబద్ధాలను పట్టించుకోవద్దన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరపతియాదవ్, మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, నాయకులు ఒడ్నాల శ్రీనివాస్ ఉన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న ఉద్యమకారులు

కమాన్‌పూర్: స్వరాష్ట్ర సాధన కోసం కృషి చేసిన ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. రామగిరి మండలం సెంటినరీకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఉద్యమకారులను సత్కరించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, బత్తుల శంకర్, జాగిరి రజిత, మొగిలి రేణుక, పబ్బతి రాధాదేవి, కావటి మల్లేశ్వరి, గౌరరెడ్డి తదితరులు ఉన్నారు.

'ఆర్‌ఆర్‌ఆర్' సెంటర్ ప్రారంభం


అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సరోజన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 38వ డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను మంగళవారం కార్పొరేటర్ జంగాపల్లి సరోజన ప్రారంభించారు. కాలనీలో పొడి చెత్త సేకరణపై కార్పొరేటర్ ప్రజలకు అవగాహన కల్పించారు. సేకరించిన పొడి చెత్తను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో నిల్వ చేసి విక్రయిస్తారని వివరించారు. డివిజన్ సీవో ఊర్మిళ, శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, అజయ్, ఆర్పీలు సంధ్య, అస్మా తదితరులు పాల్గొన్నారు.

రామగుండం మీదుగా హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ

గోదావరిఖనిటౌన్: రామగుండం ప్రజల విజ్ఞప్తి మేరకు గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు వయా రామగుండం (ఏ పవర్‌హౌస్, మజీద్ కార్నర్) బీ పవర్‌హౌస్ మీదుగా బుధవారం రాత్రి 11 గంటల నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు గోదావరిఖని డిపో మేనేజర్ పి.మల్లేషం తెలిపారు. రామగుండం ప్రజలు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే అవకాశం ఉందని, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

✦కంటి వెలుగులో 174మందికి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న కంటివెలుగులో మంగళవారం 174 మందికి కంటి పరీక్షలు చేసి 13మందికి కంటి అద్దాలు అందజేశారు. మండల వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా, సర్పంచ్ గొల్లె కావేరి, మెడికల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

✦బోరువెల్‌కు భూమిపూజ

జూలపల్లి: మండల కేంద్రంలోని కురుమ సంఘం సభ్యుల ఆరాధ్య దైవం బీరన్న ఆలయం వద్ద ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంజూరు చేసిన బోరువెల్ వేసేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ భూమిపూజ చేశారు. కురుమ సంఘం నాయకులు పొట్యాల మల్లేశం, కోరె శ్రీనివాస్, ఐరుమల్ల రాములు, పెద్ది భరత్, గుంటి శంకర్, బండారి శంకర్ ఉన్నారు.

✦రేపు మంథనిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

మంథని: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 25న మంథనిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

✦ముగిసిన ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు

జూలపల్లి: మండల కేంద్రంలో పాటు గ్రామాల్లో వారంరోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం మంగళవారంతో ముగిశాయి. జూలపల్లి, పెద్దాపూర్, వెంకట్రావుపల్లె, కుమ్మరికుంట గ్రామాల్లో నిర్వహించిన పారిశుధ్య పనులను ఎంపీవో కిరణ్ పరిశీలించారు. కార్యదర్శులు లచ్చయ్య, శరత్, పున్నమయ్య, అంజలీదర్ పాల్గొన్నారు.

✦ఆశ్రమంలో అన్నదానం

గోదావరిఖనిటౌన్: కరోనాతో మృతి చెందిన తమ పెద్ద కుమారుడు శైలేంద్రకుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా మార్కండేయ కాలనీకి చెందిన రామిళ్ల రామలింగం–మంగళ దంపతులు స్థానిక ఎండీహెచ్‌డబ్ల్యూ ఆశ్రమంలో మంగళవారం బాలల సంరక్షణ సంస్థలోని పిల్లలకు అన్నదానం చేశారు.

✦బుక్స్ అందజేత

ఎలిగేడు: మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి గ్రామంలోని తీట్ల సునీత, రమ విద్యార్థులు గురుకుల ప్రవేశపరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ అందించిన ప్రవేశపరీక్ష మెటీరియల్, పుస్తకాలను కేసీఆర్ సేవాదళం మండల అధ్యక్షుడు బింగి రాజు అందజేశారు.

✦పారిశుధ్య పనుల పరిశీలన

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం డీఎల్‌పీవో రాంబాబు పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా కూడా పారిశుధ్య లోపం తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎల్‌పీవో వెంట సర్పంచ్ గంట పద్మ–వెంకటరమణారెడ్డి, ఎంపీవో భాస్కర్, కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

✦పరామర్శ

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటకు చెందిన మారం రమేశ్ కొన్నిరోజుల క్రితం ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడ్డాడు. విషయం తెలుసుకున్న బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష మంగళవారం రమేశ్‌ను పరామర్శించి, రూ.3వేలు అందజేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

పాలకుర్తి: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధుసూదన్ అన్నారు. పాలకుర్తి మండలంలోని కుక్కలగూడుర్ గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రకాశ్, ఏఈవో శశిధర్ తదితరులు పాల్గొన్నారు.


ఓదెల మండలంలో..

ఓదెల: ప్రస్తుత సీజన్‌లో రైతులకు వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పొత్కపల్లి ఎస్సై రామక్రిష్ణ పేర్కొన్నారు. మండలంలోని ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లోని పలు ఫర్టిలైజర్ షాపులను మంగళవారం ఎస్సై, ఏవో నాగార్జున తనిఖీ చేశారు. ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బార్‌కోడింగ్ లేని విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు.

బియ్యం అందజేత

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని అమ్మ పరివార్ అనాథ పిల్లల ఆశ్రమానికి ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం అందజేశారు. ప్లంబర్ అసోసియేషన్ సభ్యులు సరిగొమ్ముల మధుసాయి, కాదాసి మల్లేశ్, దేశెట్టి తిరుపతి, పంగ అంజయ్య, కాయిత శ్రీనివాస్, మద్దెల కొమురయ్య, ఇనుముల రాజేందర్ పాల్గొన్నారు.

నిలిచిన ఎత్తిపోతలు


గోదావరిలోకి నిలిచిన ఎత్తిపోతలు

రామగుండం: కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిచిపోవడంతో గోదావరినదిలో బ్యాక్ వాటర్ తగ్గిపోవడంతో ఇసుక తెప్పలు దర్శనమిస్తున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టులో సైతం వరద నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉందని నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఏమీ రావడం లేదని, ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ 331 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు కాగా మొత్తంగా ఔట్‌ఫ్లో 452 క్యూసెక్కులుగా ఉంది.

క్లుప్తంగా

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ


స్టాకును పరిశీలిస్తున్న ఎస్సై సంతోష్‌కుమార్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల, అంతర్గాం, విసంపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను మంగళవారం అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయించినా, సరఫరా చేసినా.. వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఏ షాపులోనైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట అంతర్గాం మండల వ్యవసాయాధికారి భూక్య రాంబాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల పరిశీలన


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కమాన్‌పూర్: రామగిరి మండలం రత్నాపూర్‌లో సింగరేణి సంస్థ సహకారంతో రూ.4.19కోట్లతో ఏర్పాటు చేస్తున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను మంగళవారం మంథని డివిజన్ డీఈ శివరాములు, కన్‌స్ట్రక్షన్ డీఈ జూపల్లి రాంచందర్‌రావు, ఎంఆర్‌టీ డీఈ బాలయ్య పరిశీలించారు. సింగరేణి సంస్థ రత్నాపూర్, పన్నూర్ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అందించడానికి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి మూడు ఫీడర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొంది. కొద్దిరోజుల్లో పనులు పూర్తి చేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామని డీఈఈలు తెలిపారు. పర్వంచ్ పల్లె ప్రతిమపీవీరావు, ఏడీఈ విజయపాల్‌సింగ్, ఏఈలు రాజు, శ్రీధర్, మల్లయ్య, శ్రీనివాస్, సబ్‌ఇంజనీరు సతీశ్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

జ్యోతినగర్: పేద కుటుంబానికి మహిళా మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ అండగా నిలిచారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్య కాలనీలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న కోడూరి రమేశ్ ఇటీవల మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో వారి కుటుంబ అవసరాల కోసం మృతుడి తల్లి చంద్రమ్మ, కూతురు పల్లవికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు మంగళవారం అందించినట్లు చంద్రకళ తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాన్ని దాతలు స్పందించి ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మమత, సింధు ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన జాగటి రఘువర్మ ప్రమాదంలో మృతి చెందాడు. అయితే రఘు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున ప్రమాద బీమా రూ.2లక్షల చెక్కును మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ బొజ్జ సాగర్, నాయకులు నీలం శ్రీనివాస్, దండె రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం


విరాళం అందిస్తున్న విజయ్

జ్యోతినగర్: పోరడపల్లి పోచమ్మ కొలుపు బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనకు పొన్నం విజయ్ రూ.10,116 విరాళం అందించారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెకు చెందిన పొన్నం విజయ్, ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్ ప్రాంతంలో జూన్ మొదటి వారంలో నిర్వహించనున్న పోచమ్మ అమ్మవారి కొలుపు పూజల కోసం మంగళవారం విరాళం అందించారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో బుధవారం 10 గంటలకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఉంటుందని ఎంపీపీ బాలాజీరావు తెలిపారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన చెప్పారు.

ఫ్లెక్సీల తొలగింపుపై కాంగ్రెస్ ధర్నా


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడంపై ఆ పార్టీ నాయకులు మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అధికారంలో ఉన్నవారు నెలల తరబడి ఫ్లెక్సీలు కట్టినా మున్సిపాలిటీ పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీవి మాత్రం 24 గంటలలోపే తొలగిస్తారా అని మండిపడ్డారు. అధికారులు ఏకపక్ష నిర్ణయంతో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే గుణపాఠం తప్పదన్నారు. ప్రజాసామ్యంలో అందరినీ సమానంగా చూడాల్సిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ధర్నాతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసుల జోక్యంతో ధర్నా విరమించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ, జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీశ్, మున్సిపల్ కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంతు, నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డి, మంథని సత్యం, గోటికార్ కిషన్, ఎల్లంకి వంశీ, మంథని సురేశ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో మద్దతు ధర


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

జూలపల్లి: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో రైతులకు మద్దతు ధర లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. జూలపల్లి మండల కేంద్రంలో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ నర్సింహయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎన్నో రకాల పథకాలు అమలు చేస్తోందని, త్వరలోనే అకాల వర్షాలతో మొక్కజొన్న నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం రైతుల ఖాతాలో జమవుతాయని తెలిపారు. వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లోక రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు ముత్తులింగం, నాయకులు విసారపు వెంకటేశం, రాంగోపాల్‌రెడ్డి, పొలగాని సతీశ్, డైరెక్టర్లు శంకరయ్య, సంఘం కార్యదర్శి సరేశ్ ఉన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ మిషన్ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తెలంగాణ అంబేడ్కర్ భవన్ నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ భవన్‌లో భాగ్యరెడ్డివర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దళిత వర్గాలను చైతన్యం చేయడంలో భాగ్యరెడ్డివర్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ పోగుల రంగయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు శనిగరపు రామస్వామి, మ్యాదరి భాగ్యరెడ్డివర్మ, గొర్రె రమేశ్, బొంకూరి మధు, మైస రాజేశ్, కాంపెల్లి సతీశ్, మంథెన లింగయ్య, సలిగంటి ఓదెలు, కొండ్ర వెంకటేశ్, జిలకర రామస్వామి, ఇందారపు రవి, పాత రాజయ్య, కాదాశి సాయితేజ, మంథెన పవన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి


సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌ను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ కోరారు. పట్టణంలోని 3, 5, 9వ వార్డుల్లో మంగళవారం సిబ్బంది చేస్తున్న పారిశుధ్య కార్యక్రమాలు, సర్వేను ఆయన తనిఖీ చేపట్టారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆర్పీలు, కౌన్సిలర్లకు సూచనలు చేశారు. తమ ఇంటి పక్కనే ఉన్న ఓపెన్ ప్లాట్లలో సైతం ఇష్టానుసారంగా చెత్త పారవేసేవారికి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ పెనుభూతంతో వచ్చే ప్రమాదాల గురించి వివరించారు. ప్లాస్టిక్ విక్రయించే షాప్ యజమానులకు జరిమానా విధిస్తామని, బట్ట సంచులు మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు నిశాంత్, పారుపల్లి జ్ఞానేశ్వరి, గొట్టం లక్ష్మి, వార్డ్ ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

కాల్వశ్రీరాంపూర్: రైతుల అవసరాల మేరకు సింగిల్‌విండోల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేస్తోందని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సింగిల్‌విండో విత్తన విక్రయ కేంద్రంలో జీలుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. 30కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.850 చెల్లించి తీసుకోవాలని కోరారు. సింగిల్‌విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, ఏవో నాగార్జున, రైతుసమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సీఈవో శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రెడ్డి, సారంగపాణి పాల్గొన్నారు.

ధాన్యం తూకం వేయడంలో అన్యాయం

ధర్మారం: ధర్మారం మార్కెట్ యార్డులోని వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేయడంలో సామాన్య రైతులకు అన్యాయం జరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వారి ధాన్యాన్ని త్వరగా తూకం వేస్తున్నారని, సామాన్య రైతుల ధాన్యం మాత్రం నెలల తరబడి కేంద్రంలో ఉంటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ధర్మారం కేంద్రంలో వీర మల్లేశం నెలరోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చి ఆరబెట్టి, తూర్పార పట్టి తూకం వేయాలని కోరినన్ని గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని రైతు ఆవేదన చెందాడు. ఇప్పటికైనా క్రమ పద్ధతిలో ధాన్యం తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కార్యదర్శులు

కాల్వశ్రీరాంపూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేసి పదోన్నతి కల్పించనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కాల్వశ్రీరాంపూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఎంపీవో గోవర్ధన్, సూపరింటెండెంట్ సురేశ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ జిన్న రాంచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సౌజన్య, రాజ్‌కుమార్, మంగా రెడ్డి, నాయక్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓదెల మండలంలో..

ఓదెల: జూనియర్ కార్యదర్శులకు పదోన్నతి కల్పిస్తూ ప్రకటించినందుకు ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎంపీపీ కునారపు రేణుకదేవి ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిసేకం చేశారు. ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వాజీద్, కార్యదర్శుల సంఘం ప్రతినిధులు భానుప్రసాద్, కిరణ్, సతీశ్, శ్రీకాంత్, మీనా, రమేశ్, దిలీప్ పాల్గొన్నారు.